క్లుప్తంగా

పెదవేగి పోలీస్‌స్టేషన్‌లో డీఎస్పీ తనిఖీ


పెదవేగి పోలీస్‌స్టేషన్‌లో డీఎస్పీ అశోక్‌కుమార్

పెదవేగి : పెదవేగి పోలీస్ స్టేషన్‌ను ఏలూరు డీఎస్పీ ఈడా అశోక్ కుమార్ గౌడ్ మంగళవారం సాధారణ తనిఖీ చేశారు. స్టేషన్ రికార్డులను ఆయన పరిశీలించారు. సిబ్బంది పనితీరును అభినందించారు. స్టేషన్‌కు వచ్చే బాధితుల సమస్యలపై పూర్తిస్థాయి విచారణ చేయాలని, డివిజన్‌లో అన్ని పోలీస్‌స్టేషన్లకు ఆదేశాలు జారీ చేసామని డీఎస్పీ చెప్పారు. ఏలూరు డివిజన్‌లో శాంతి భద్రతలు అదుపులో ఉన్నాయన్నారు. రేకుల షెడ్డులో కొనసాగుతున్న పెదవేగి పోలీస్‌స్టేషన్‌కు పక్కా భవన నిర్మాణ విషయంపై జిల్లా అధికారులకు వివరిస్తానని డీఎస్పీ తెలిపారు.

బాల్య వివాహాలు చేయొద్దు


గొల్లగూడెంలో మాట్లాడుతున్న చేబ్రోలు పీహెచ్‌సీ డాక్టర్ సుబ్బరాజు వర్మ

ఉంగుటూరు: బాల్య వివాహాలు చేయవద్దని చేబ్రోలు పీహెచ్‌సీ డాక్టరు సుబ్బరాజు వర్మ అన్నారు. మంగళవారం ఉంగుటూరు మండలం గొల్లగూడెం సచివాలయం వద్ద వర్మ మాట్లాడుతూ కౌమార దశలో యువతులకు వివాహం చేస్తే ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయని అన్నారు. పుట్టే పిల్లలు బలంగా ఉండరని, వారికి వ్యాధి నిరోధక శక్తి ఉండదని, తల్లులు బలహీనమై అనారోగ్యంతో బాధపడాల్సి వస్తుందని డా. సుబ్బరాజు అన్నారు. బాల్య వివాహాల నిరోధానికి రూపొందించిన చట్టాలపై అవగాహన కల్పించారు. కమ్యూనిటీ హెల్త్ ఆఫీసరు పద్మ, హెల్త్ ఎడ్యుకేటర్ సుబ్బలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి సురేష్, సచివాలయ సిబ్బంది, మహిళలు పాల్గొన్నారు.

నేడు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

పెదవేగి : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ జి రాజ్‌మనోజ్ తెలిపారు. ఆయన తన కార్యాలయంలో మాట్లాడుతూ మధ్యాహ్నం 2 గంటలకు పెదవేగి ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ తాతా రమ్యకుమార్ అధ్యక్షతన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహిస్తామని తెలిపారు. ఈ సమావేశానికి మండల స్థాయి అధికారులందరూ హాజరు కావాలని ఎంపీడీఓ తెలియజేశారు.

ఆంజనేయస్వామి ఆలయంలో అన్నదానం

పెదపాడు: స్థానిక బళ్లరేవుతూము సెంటర్‌లోని ఆంజనేయస్వామి ఆలయంలో అన్నదానం నిర్వహించారు. మంగళవారం పురస్కరించుకుని పోల సింహాచలం జ్ఞాపకార్థం వారి కుమారుడు ఎల్‌ఐసీ ఏజెంట్ పోల వెంకటేశ్వరరావు ఆర్థిక సహాయంతో అన్నదానం నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఆలయ ధర్మకర్త రేముల గడ్డ రాము పాల్గొన్నారు.

రీ సర్వేతో భూ సమస్యలకు చెక్


రోవర్ సహాయంతో సరిహద్దులు నిర్ణయిస్తున్న పెదపాడు మండల రీ సర్వే అధికారులు

పెదపాడు: రైతుల సమస్యలకు రీ సర్వే ఎంతగానో ఉపయోగపడుతుందని తహసీల్దార్ జీ విజయకుమార్ రాజు తెలిపారు. మండలంలోని వీరమ్మకుంట శివారు రావులకుంట రెవెన్యూ పరిధిలో నూతన పరిజ్ఞానంతో జగనన్న శాశ్వత భూహక్కు- భూరక్ష పథకంలో భాగంగా మంగళవారం భూ సర్వే చేపట్టి సరిహద్దులు గుర్తించే పనులను ప్రారంభించారు. మండలంలో రైతుల సమస్యల పరిష్కారానికి ఈ రీ సర్వే ఎంతో ఉపయోగపడుతుందని తహసీల్దార్ అన్నారు. భూ వివాదాలకు చెక్ పెట్టేందుకు ప్రభుత్వం ఈ సర్వే చేపడుతోందని సర్వే అధికారులు తెలిపారు. రికార్డుల్లో తప్పులు సరిచేసేందుకు ఈ సర్వే వల్ల సాధ్యమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వీఆర్వో, భూ సర్వేయర్లు పాల్గొన్నారు.

ప్రతిభావంతులకు ప్రోత్సాహం

భీమడోలు: ప్రతిభ గల విద్యార్థులను ప్రోత్సహించడం అభినందనీయమని భీమడోలు హెచ్‌ఎం టి.పుష్పావతి అన్నారు. కోరమాండల్ ఫెర్టిలైజర్ కంపెనీ పాఠశాలలో పదో తరగతి ఉత్తమ ప్రతిభను కనబర్చిన ఇద్దరు బాలికలకు ఏలూరులో మంగళవారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో బాలికలకు ప్రతిభ పురస్కారాలను అందించారు. పాఠశాల స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచిన లంకా వినూత్నకు రూ.5వేలు, ద్వితీయ స్థానం పొందిన కొండే రుతికకు 3వేలు చొప్పున నగదు అందించి సన్మానించారు. బాలికలను హెచ్‌ఎం, ఉపాధ్యాయులు అభినందించారు.

కన్వీనర్లు, గృహసారథుల పాత్ర కీలకం

సమీక్ష సమావేశంలో ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి


సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి

దెందులూరు: జగనన్న సచివాలయ కన్వీనర్లు, గృహసారథుల పాత్ర రానున్న రోజుల్లో కీలకమని, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశయాలను సమష్టి కృషితో నెరవేర్చాలని ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి అన్నారు. మంగళవారం శ్రీరామవరంలో వైఎస్సార్ సీపీ దెందులూరు పార్టీ మండల అధ్యక్షుడు కామిరెడ్డి నాని అధ్యక్షతన కామిరెడ్డి గార్డెన్స్‌లో నియోజకవర్గ సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సరికొత్త చరిత్ర సృష్టించారన్నారు. జగనన్న నాయకత్వంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చేసిన సంక్షేమ, అభివృద్ధి పనులను ప్రజలందరికీ గుర్తు చేయాలన్నారు. రానున్న ఎన్నికల్లో నూరు శాతం విజయమే లక్ష్యంగా పనిచేయాలన్నారు. గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు పార్టీ రథసారథులుగా మారి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. అర్హులైన పేదలకు ఏదైనా పథకం అందకపోతే వారి సమస్యను పరిష్కరించాలన్నారు. అనంతరం గృహసారథులు, సచివాలయ కన్వీనర్ల అభిప్రాయాలను, వారి విధి నిర్వహణ, లక్ష్యాలను దెందులూరు మండల అధ్యక్షుడు కామిరెడ్డి నాని వివరించారు. సమీక్ష సమావేశంలో వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి జానంపేట ప్రసాదబాబు, మూడు మండలాల పార్టీ అధ్యక్షుడు అప్పనప్రసాద్, తేరా ఆనంద్, మెట్లపల్లి సూరిబాబు, జెడ్పీటీసీ సభ్యులు నిట్టా లీలానవకాంతం, గంటా పద్మశ్రీ ప్రసాదరావు, పెనుమాల విజయ్‌బాబు, ఎంపీపీలు బొమ్మనబోయిన సుమలత, తాతా రమ్య, బత్తుల రత్నకుమారి, పెన్మెత్స శ్రీనివాసరాజుతో పాటు నియోజకవర్గంలోని రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ, మండల, గ్రామస్థాయి పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, సర్పంచులు, ఎంపీటీసీలు కోఆపరేటివ్ బ్యాంక్ అధ్యక్షులు పాల్గొన్నారు.

వెల్లమిల్లి పాఠశాలకు కుర్చీల బహూకరణ


వెల్లమిల్లి పాఠశాలకు దాతలు అందించిన కుర్చీలు

ఉంగుటూరు: ఉంగుటూరు మండలం వెల్లమిల్లి ఫౌండేషన్ ప్లస్ పాఠశాలకు అక్కిన రాజేంద్రప్రసాద్ కుర్చీలను బహూకరించారు. రూ. 3వేలు విలువ గల 4 కుర్చీలను మంగళవారం పాఠశాల హెచ్‌ఎం గొర్రెల వెంకట సత్యవతికి ఆయన అందజేశారు. ఈ సందర్భంగా దాతకు హెచ్‌ఎం, ఉపాధ్యాయులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రెడ్డి అనితారాణి తదితరులు పాల్గొన్నారు.

గణపవరం డిగ్రీ కాలేజీలో కొత్త కోర్సులు


డిగ్రీ కాలేజీ అధ్యాపకులు, విద్యార్థుల ప్రదర్శన

గణపవరం: గణపవరంలోని చింతలపాటి మూర్తిరాజు ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో అన్ని వసతులతో, అధ్యాపకులతో కొత్త కోర్సులు అందుబాటులో ఉన్నాయని డిగ్రీ కాలేజీ ప్రిన్సిపల్ నిర్మల కుమారి అన్నారు. మంగళవారం డిగ్రీ కాలేజీ అధ్యాపకులు, విద్యార్థులు ప్రదర్శనగా జూనియర్ కాలేజికి వెళ్లి ఇంటర్ విద్యార్థులను ఇంటర్ పూర్తయ్యాక డిగ్రీలో తమ కాలేజీలో చేరాలని ఆహ్వానించారు. కళాశాలకు న్యాక్ గుర్తింపు ఉందని, కళాశాలలో కంప్యూటర్ సైన్సు కోర్సులు ప్రవేశ పెట్టారని విద్యార్థులకు వివరించారు. అన్ని సబ్జెక్టులకు అధ్యాపకులు అందుబాటులో ఉన్నారని, ల్యాబ్, లైబ్రరీ సదుపాయాలు ఉన్నాయని విద్యార్థులకు వివరించారు. విద్యార్థులు తమ కాలేజీలో చేరాలని ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ పి.మధురాజు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆరోగ్యానికి రోజూ వ్యాయామం అవసరం


గణపవరంలో ర్యాలీ, ప్రదర్శన నిర్వహిస్తున్న వైద్యసిబ్బంది

గణపవరం: మంచి ఆరోగ్యానికి రోజూ క్రమం తప్పని వ్యాయామం చేయాలని, ముఖ్యంగా సైక్లింగ్ చేయడం వల్ల మంచి దేహ దారుఢ్యంతో పాటు ఆరోగ్యాన్ని పొందవచ్చునని గణపవరం పీహెచ్‌సీ వైద్యాధికారులు సంతోష్, కిరణ్మయి అన్నారు. మంగళవారం ఆరోగ్యమేళా కార్యక్రమంలో భాగంగా సైకిల్ ఫర్ హెల్త్ కార్యక్రమం నిర్వహించారు. ప్రతిరోజూ కొంత సమయం సైకిల్ తొక్కడం వల్ల కండరాలు బలపడి, శరీర బరువు తగ్గుతుందని, అధిక రక్తపోటు, మధుమేహ వ్యాధులను అదుపులో ఉంటుందని, మానసిక ఒత్తిడి తగ్గుతుందని వారు అన్నారు. గ్రామ వెల్‌నెస్ సెంటర్లలో ప్రత్యేకంగా టెలీ కన్సల్టేషన్ సేవలు అందుబాటులో ఉంటాయని, గర్భిణులు, మధుమేహం, రక్తపోటు వ్యాధులకు గ్రామంలోనే సేవలందిస్తారని తెలిపారు. ఈ సేవలను ప్రజలంతా వినియోగించుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌వో జె.విల్సన్, పీహెచ్‌ఎన్ జి.వరలక్ష్మి, ఆరోగ్య సహాయకుడు యోహాన్ పాల్గొన్నారు.

పోతునూరులో ఆయుష్మానుభవ సైకిల్ ర్యాలీ

దెందులూరు: ప్రతి ఒక్కరి ఆరోగ్యం కాపాడటం సకాలంలో గ్రామ శివారు ప్రాంతాలకు 24 గంటలూ వైద్యసేవలందించడం ఆయుష్మానుభవ పథకం లక్ష్యమని పోతునూరు వైద్యాధికారిణి డాక్టర్ కృష్ణ చైతన్య, ఎంపీహెచ్‌ఈఓ శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం పోతునూరులో పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది ఆయుష్మానుభవ సైకిల్ ర్యాలీ నిర్వహించారు. పాఠశాల చిన్నారులకు వ్యాధులు, వైద్య పరీక్షలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు.

అభివృద్ధి పనుల్లో జాప్యం సహించేది లేదు


పంచాయతీ కార్యదర్శుల సమావేశంలో మాట్లాడుతున్న పెదపాడు ఎంపీడీవో ఎస్ నిర్మలజ్యోతి

పెదపాడు: మండలం పరిధిలో అభివృద్ధి పనుల్లో జాప్యాన్ని సహించేది లేదని పెదపాడు ఎంపీడీవో ఎస్ నిర్మలజ్యోతి ఆదేశాలు జారీ చేసారు. గ్రామ సచివాలయ సిబ్బంది అలసత్వం వహించవద్దని హెచ్చరించారు. పెదపాడు మండలంలోని అన్ని గ్రామాల్లో ఉన్నతాధికారుల ఆదేశాల ప్రకారం అభివృద్ధి పనులు పూర్తి చేసి ముందు వరసలో ఉండాలన్నారు. వేసవి కాలంలో నీటి ఎద్దడి లేకుండా చూడాలన్నారు. నిర్ణీత గడువులోగా ఇంటి పన్నులు, నీటి పన్నులు వసూళ్లు పూర్తి చేయాలని ఆదేశించారు. గ్రామ వలంటీర్లు సహాయంతో ప్రజలకు సంక్షేమ పథకాలు అందించేందుకు గ్రామ సచివాలయ సిబ్బంది, కార్యదర్శులదే ప్రముఖ పాత్ర అని చెప్పారు. ఈ కార్యక్రమంలో పెదపాడు ఈఓ ఆర్డీ ఎస్ సూర్యకుమార్, ఏఓ రవి కుమార్ వివిధ గ్రామాల పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

కాలినడక భక్తులకు మరిన్ని సౌకర్యాలు కల్పించాలి


ఎమ్మెల్యే వాసుబాబును సత్కరించిన పద్మ, జ్యోతి శ్రీనివాస్ దంపతులు

భీమడోలు: చినవెంకన్న క్షేత్రానికి నిత్యం కాలినడకన విచ్చేసే భక్తులకు మరిన్ని సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేయాలని ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అన్నారు. ఇటీవల శ్రీవారి దేవస్థానం ట్రస్టుబోర్డు సభ్యురాలిగా ప్రమాణ స్వీకారం చేసిన పెద్దిరెడ్డి వెంకటకొండ పద్మ, జ్యోతిశ్రీనివాస్ దంపతులు మంగళవారం నిడమర్రు మండలం భువనపల్లిలోని ఎమ్మెల్యే నివాసానికి వెళ్లి, మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం ఆయనకు దుశ్శాలువాను కప్పి, పూలబొకేను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వాసుబాబు మాట్లాడుతూ ఆలయానికి వచ్చే భక్తులకు నూతన పాలక మండలి మెరుగైన సేవలు అందించాలన్నారు.

మెనూ ప్రకారం జగనన్న గోరుముద్ద అందించాలి


దేవరగోపవరంలో విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న జెడ్పీటీసీ కోడే కాశి

నిడమర్రు: జగనన్న గోరుముద్ద పథకంలో ప్రభుత్వం అమలు చేస్తున్న మెనూ ప్రకారం ఆహార పదార్థాలు విద్యార్థులకు అందించాలని జెడ్పీటీసీ కోడే కాశి అన్నారు. మంగళవారం దేవరగోపవరం ఎంపీపీ స్కూల్లో జగనన్న గోరుముద్ద పథకం అమలు తీరుని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మంగళవారం విద్యార్థులకు వడ్డించిన పులిహోర ఆయన రుచి చూసి అసంతృప్తి వ్యక్తం చేసారు. పులిహోరలో తగినన్ని తాలింపులు, వేరుశెనగ గుండ్లు కనిపించకపోవడంతో నిర్వాహకులను వివరణ అడిగారు. పేద విద్యార్థులకు పౌష్టిక ఆహారం అందించాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వారంలో 6 రోజులు వివిధ రకాల వంటకాలతో మధ్యాహ్నం భోజన పథకంలో సరికొత్త మెనూ అమలు చేస్తున్నారన్నారు. మార్చి 3 నుంచి వారానికి 3 రోజులు విద్యార్థులకు ఉదయం రాగులు, బెల్లంతో తయారు చేసే జావను అందించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక వైసీపీ నేతలు, పాఠశాల సిబ్బంది, విద్యా కమిటీ సభ్యులు ఉన్నారు.

వైఎస్సార్ ఆరోగ్య క్లీనిక్‌లలో హెల్త్ మేళా


పీహెచ్‌సీలో సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ పి. తేజశ్రీ

నిడమర్రు: ప్రతి నెల 14న ఆరోగ్య సిబ్బంది ఆధ్వర్యంలో మండల వ్యాప్తంగా ఉన్న వైఎస్సార్ ఆరోగ్య క్లీనిక్‌లలో హెల్త్ మేళా నిర్వహిస్తున్నట్లు మండల వైద్యాధికారి డాక్టర్ పి. తేజశ్రీ అన్నారు. మంగళవారం పెదనిండ్రకొలను పీహెచ్‌సీలో నిర్వహించిన హెల్త్ మేళా సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రతి నెల 14న ఆయా సచివాలయాల వద్ద మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్లు, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లతో పాటు 14 రకాల వైద్య పరీక్షలు, వివిధ రోగాలకు సంబంధించిన 67 రకాల మందులు అందుబాటులో ఉంటాయన్నారు. ప్రజలంతా ఆరోజు వైద్య సేవలు వినియోగించుకోవాలని కోరారు. క్లీనిక్‌లలో బీపీ, సుగర్ వ్యాధుల మందులు ఉచితంగా అందిస్తామన్నారు. పరీక్షల్లో ఆరోగ్య సమస్యలు గుర్తించి ఉన్నత స్థాయి ఆస్పత్రులకు రిఫర్ చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కమ్యునిటీ హెల్త్ ఆధికారి డి. సంజీవ, పీహెచ్‌ఎన్ మరియమ్మ, ఆరోగ్య విస్తరణ అధికారి ఎం. జగ్గారావు తదితరులున్నారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలల్లో ఆరోగ్య సిబ్బంది ఆధ్వర్యంలో విద్యార్థులతో కలిసి సైకిల్ ర్యాలీ నిర్వహించారు.

గర్భిణులకు ఉచిత వైద్య పరీక్షలు


భీమడోలులో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య ఆరోగ్య సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు

భీమడోలు: ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని భీమడోలు విలేనెస్ సెంటర్ పరిధిలో మంగళవారం సిబ్బంది, విద్యార్థులు సైకిల్ ర్యాలీ నిర్వహించారు. భీమడోలు వెల్‌నెస్ సెంటర్‌లో ఎంఎల్‌హెచ్‌పీ నాగదుర్గా ఆధ్వర్యంలో సిబ్బంది దీర్ఘకాలిక రోగులు, గర్భిణులకు, ఇతర వ్యాధులతో బాధపడుతున్న వారికి ఉచిత వైద్య పరీక్షలు చేసారు. అనంతరం భీమడోలు జెడ్పీ ఉన్నత పాఠశాల, మానస ఇంగ్లీషు మీడియం పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయుల బృందం కలిసి సైకిల్‌పై ర్యాలీ నిర్వహించారు. ఎంఎల్‌హెచ్‌పీ నాగదుర్గా మాట్లాడుతూ ప్రతి నెల 14న వరల్డ్ హెల్త్ డే నిర్వహించి, రోగులకు 14 రకాల వైద్య పరీక్షలు, 67 రకాల మందులను అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మానస ఇంగ్లీషు మీడియం పాఠశాల ప్రిన్సిపల్ యలమర్తి రవీంద్ర కుమార్, వైద్య ఆరోగ్య సిబ్బంది టి.మురళీ, బి.సుజనీకుమార్, చంద్రకళ, ఆశావర్కర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

కానరాని మామిడి పూత


న్యాయంపల్లి తోటలో పూత పూయని మామిడి చెట్లు

పెదవేగి: ఈ ఏడాది సక్రమంగా వర్షాలు కురిసినా మామిడి చెట్లకు పూత రాకపోవడంతో మండలంలోని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఏటా డిసెంబర్‌లో పూత వచ్చేది. ఈ ఏడాది ఫిబ్రవరి వచ్చినా పూత కనిపించకడం లేదని మామిడి తోటల యజమానులు అంటున్నారు. దీంతో పల్లెలకు వ్యాపారులు, లీజుకు తీసుకునేవారు రావడం లేదని రైతులు చెబుతున్నారు. నియోజకవర్గంలోని పెదవేగి మండలంలోని విజయరాయి, నడిపల్లి, గార్లమడుగు, ముత్తనవీడు, న్యాయంపల్లి, కవ్వగుంట, తదితర గ్రామాల్లో రైతులు మామిడి తోటలపైనే ఆధారపడి జీవిస్తున్నారు. మామిడి పూతకు వాతావరణం అనుకూలంగా లేదని న్యాయంపల్లికి చెందిన మామిడి రైతు సీహెచ్ వెంకన్న అన్నారు. అన్ని తోటల్లో ఎక్కువ చిగురు మాత్రమే కనిపిస్తోందని ఆయన అన్నారు. ఇప్పటి వరకు వ్యవసాయధికారి గ్రామాల్లో పర్యటించి తోటలను పరిశీలించ లేదని నడిపల్లి రైతు పి వెంకటేశ్వరరావు అన్నారు. ఏటా పంట నష్టపోతుంటే అప్పుల భారం పెరుగుతోందని ఆయన అన్నారు.

పొటాషియం, బోరాన్‌తో పూత



మామిడి పూత రావడానికి 13045 పొటాషియం నైట్రేట్ లీటరుకు 10 గ్రాముల చొప్పున, బోరాన్‌ను లీటరుకు 2 గ్రాముల చొప్పున మామిడి చెట్లకు స్ప్రే చేస్తే, పూత త్వరగా వస్తుంది. చెట్టు బలంగా పెరిగేందుకు పశువుల పేడ ఎరువుగా వేసుకొని జాగ్రత్తలు పాటించడం ద్వారా ఉత్తమ ఫలితాలు సాధించవచ్చు.

– కె రత్నమాల, ఉద్యానశాఖాధికారి పెదవేగి

మంచినీటి చెరువు పరిశీలన


వసంతవాడలో మంచినీటి చెరువును పరిశీలించిన ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు

పెదపాడు: మండలంలోని వసంతవాడ గ్రామంలోని మంచినీటి చెరువును ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ సురేష్ మంగళవారం పరిశీలించారు. ఓహెచ్‌ఎస్ ట్యాంకు వద్ద ఉన్న మంచినీటి చెరువులో గుర్రపుడెక్క, నాచు తూడు పెరిగిపోయి నీరు అపరిశుభ్రంగా మారుతోందని గ్రామస్తులు తెలియజేయడంతో మంగళవారం ఆయన పరిశీలించారు. వేసవిలో నీటి సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలని స్థానిక అధికారులకు సూచించారు. ఫిల్టర్ చేసిన నీటిని మాత్రమే ప్రజలకు సరఫరా చేయాలని స్థానిక ఇంజనీరింగ్ అధికారులకు ఆదేశాలిచ్చారు. ఈకార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్రీనివాస్ పాల్గొన్నారు.

బలివే తిరునాళ్లకు పటిష్ట ఏర్పాట్లు

- భక్తులకు ఏ విధమైన అసౌకర్యం కలగకూడదు
- ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి

పెదవేగి: బలివే తిరునాళ్లకు వచ్చే భక్తులకు ఏ విధమైన అసౌకర్యం కలుగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి అధికారులను, నాయకులను ఆదేశించారు. పెదవేగి మండలం విజయరాయి శివారు బలివే బలెరామలింగేశ్వరస్వామి ఆలయాన్ని ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి సందర్శించారు. తొలుత ఆలయంలో ప్రత్యేక పూజలు చేసిన ఆయన మహాశివరాత్రిని పురస్కరించుకుని ఈనెల 16 నుంచి నిర్వహించనున్న తిరునాళ్ల ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రఖ్యాతి గాంచిన బలివే తిరునాళ్లకు పశ్చిమ, కృష్ణా జిల్లాల నుంచి భారీ సంఖ్యలో భక్తులు వస్తారని అన్నారు.

తమ్మిలేరు రిజర్వాయర్ నుంచి నీటి విడుదల

తమ్మిలేరు రిజర్వాయర్ నుంచి నీటిని విడుదల చేశామని, తిరునాళ్లకు ముందే సుమారు 500 క్యూసెక్కుల నీటిని చేర్చుతామని తెలియజేశారు. అనంతరం బలివేకి వచ్చే రోడ్డు, పార్కింగ్, స్టాల్స్ ఏర్పాట్లపై అధికారులతో చర్చించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ పెనుమాల విజయ్‌బాబు, విజయరాయి సహకార సంఘ చైర్మన్ పాలడుగు పెదబాబు, కొప్పాక సొసైటీ చైర్మన్ చళ్లగొళ్ల భూస్వామి, నడిపల్లి గ్రామ పార్టీ అధ్యక్షుడు ఉక్కుర్తి నాగేశ్వరరావు, ఉపాధ్యక్షుడు గొట్టేటి స్టాలిన్, వైఎస్సార్ సీపీ నాయకులు పులగం వేణుగోపాల్ రెడ్డి, కరణం కిషోర్, లేగల శివ, రెడ్డెం శ్రీనివాసరెడ్డి, ఆళ్ళ చంద్రశేఖరరెడ్డి, గొట్టాపు నాగేంద్ర, మన్నె బాబురావు, వెంపాటి సీతయ్య, ఇరిగేషన్ అధికారులు, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

రూ.2.50 కోట్లతో సామాజిక ఆరోగ్య కేంద్రం నిర్మాణం

- 14 గ్రామ శివారు ప్రాంతాలకు మెరుగైన వైద్యసేవలు
- ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి


నూతన ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించి వైద్యులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి

దెందులూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చొరవతో పేదలకు కార్పొరేట్ వైద్యం అందుబాటులోకి వచ్చిందని దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి అన్నారు. మంగళవారం దెందులూరులో రూ. 2.50 కోట్లతో నిర్మించిన సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. అనంతరం వైద్యులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలో సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని ప్రారంభిస్తామన్నారు. దెందులూరులో నూతనంగా ఏర్పాటు చేసిన 30 పడకల సామాజిక ఆరోగ్య కేంద్రం నిర్మాణంపై ఎమ్మెల్యే సంతృప్తి వ్యక్తం చేశారు. అత్యాధునిక పరికరాలతో మెరుగైన వైద్య సేవలందించాలనే లక్ష్యంతో 30 పడకల వైద్యశాల మంజూరు చేయాలని ముఖ్యమంత్రిని కోరానన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ముగిసిన తరువాత సామాజిక ఆరోగ్య కేంద్రంలో వైద్య సేవలు ప్రారంభిస్తామన్నారు. వైద్యులు, వైద్యసిబ్బంది రాష్ట్ర ప్రభుత్వం, సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆశయాలకు అనుగుణంగా మానవతా దృక్పథంతో వైద్యశాలకు వచ్చే ప్రతి ఒక్కరి ఆరోగ్య పరిరక్షణకు మెరుగైన సేవలందించాలన్నారు. వైఎస్సార్ సీపీ దెందులూరు గ్రామ అధ్యక్షుడు పోకల రాంబాబు, విజయవాడ కనకదుర్గమ్మ అమ్మవారి ట్రస్ట్ బోర్డు డైరెక్టర్ తొత్తడి వేదకుమారి, వైస్ ఎంపీపీ వేమూరి జితేంద్ర, కోఆపరేటివ్ బ్యాంక్ సొసైటీ చైర్మన్ కొలుసు గణపతిరావు, ఎంపీటీసీ తాళ్ళూరి నాగరాజు, పీహెచ్‌సీ డెవలప్‌మెంట్ కమిటీ సభ్యులు కట్టా ఏసుబాబు, వైఎస్సార్ సీపీ నాయకులు పులిపాటి శ్యామలా, కొంగర రత్నకుమార్ అబ్బాస్, చల్లా మేరీరాజు, పాలడుగు శ్రీనివాసరావు ఉన్నారు.